# టాప్‌లో జనగామ రూరల్..

- 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 6.6 శాతం పోలింగ్ అధికం
- సగటు ఓటింగ్ 74.96 శాతం నమోదు
- పాలకుర్తి సెగ్మెంట్ పరిధిలోని తొర్రూరులో అత్యల్పం

జనగామ పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఓటర్లు (ఫైల్)

జనగామ, మే 15 (నమస్తే తెలంగాణ) : జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌పై స్పష్టత వచ్చింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే తాజాగా జరిగిన పోలింగ్‌లో జిల్లా సగటు ఓటింగ్ 86.33 శాతం నుంచి 74.96 శాతానికి పడిపోయింది. కానీ 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో ఈసారి 6.6 శాతం పోలింగ్ అధికంగా నమోదైంది. పోలింగ్ శాతంలో జనగామ సెగ్మెంట్‌లోని జనగామ రూరల్ మండలం 81 శాతం పోలింగ్‌తో టాప్‌లో ఉండగా, పాలకుర్తి సెగ్మెంట్ పరిధిలోని తొర్రూరులో 63.05 శాతం అత్యల్ప ఓటింగ్ నమోదైంది. జిల్లాలో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా సగటు పోలింగ్ శాతం 68.26 కాగా, ఈసారి 74.96 శాతం మంది ఓటును వినియోగించుకున్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా చూస్తే జనగామ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 74.68 శాతం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 78.77 శాతం, పాలకుర్తిలో 71.43 శాతంగా పోలింగ్ నమోదైంది. 2019లో జనగామలో 68.26శాతం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 70.42శాతం, పాలకుర్తిలో 66.11శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి చోటా ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఓటు హక్కును వినియోగించుకునేలా కృషి చేయడం సహా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం గ్రామాల్లో కళాకారులతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. ఓటు విలువపై దివ్యాంగులకు సైన్ లాంగ్వేజ్‌లో అవగాహన కల్పించింది. 85 ఏండ్లు పైబడిన వయోవృద్ధులకు, ట్రాన్స్ జెండర్లకు ఇంటి వద్ద ఓటింగ్ కల్పించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం ఓటర్లు..పోలైన ఓట్లు, పురుషులు, మహిళలు, పోలింగ్ శాతం ఇలా ఉంది.

**పాలకుర్తి నియోజకవర్గం**
**మండలాల వారీగా మొత్తం ఓట్లు..పోలైన ఓట్లు**

| మండలం | మొత్తం ఓట్లు | పోలైనవి | పురుషులు | స్త్రీలు | శాతం |
|---|---|---|---|---|---|
| పాలకుర్తి | 51,918 | 39,231 | 19,762 | 19,469 | 75.56 |
| దేవరుప్పుల | 36,624 | 28,380 | 14,397 | 13,983 | 77.49 |
| కొడకండ్ల | 28,436 | 19,805 | 10,055 | 9,749 | 69.65 |
| పెద్దవంగర | 24,986 | 17,662 | 8,895 | 8,767 | 70.69 |
| రాయపర్తి | 45,778 | 34,707 | 17,471 | 17,235 | 75.82 |
| తొర్రూరు | 67,772 | 42,730 | 21,103 | 21,621 | 63.05 |
| **మొత్తం** | **2,55,514** | **1,82,515** | **91,683** | **90,824** | **71.43** |

**జనగామ నియోజకవర్గం**
**మండలాల వారీగా మొత్తం ఓట్లు..పోలైన ఓట్లు**

| మండలం | మొత్తం ఓట్లు | పోలైనవి | పురుషులు | స్త్రీలు | శాతం |
|---|---|---|---|---|---|
| బచ్చన్నపేట | 38,616 | 28,394 | 14,296 | 14,097 | 73.53 |
| జనగామ రూరల్ | 33,583 | 27,202 | 13,774 | 13,428 | 81.00 |
| జనగామ అర్బన్ | 42,888 | 29,322 | 14,651 | 14,663 | 68.37 |
| నర్మెట | 20,181 | 15,419 | 7,710 | 7,709 | 76.42 |
| చేర్యాల | 45,948 | 34,194 | 17,042 | 17,152 | 74.42 |
| తరిగొప్పుల | 15,717 | 12,145 | 6,097 | 6,048 | 77.27 |
| కొమురవెల్లి | 15,322 | 11,815 | 5,981 | 5,834 | 77.11 |
| మద్దూరు | 17,349 | 12,927 | 6,515 | 6,412 | 74.51 |
| ధూల్మిట్ట | 13,167 | 9,884 | 4,928 | 4,956 | 75.68 |
| **మొత్తం** | **2,42,771** | **1,81,302** | **90,994** | **90,299** | **74.68** |

**స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం**
**మండలాల వారీగా మొత్తం ఓట్లు..పోలైన ఓట్లు**

| మండలం | మొత్తం ఓట్లు | పోలైనవి | పురుషులు | స్త్రీలు | శాతం |
|---|---|---|---|---|---|
| చిల్పూరు | 32,678 | 26,338 | 13,314 | 13,023 | 80.60 |
| ధర్మసాగర్ | 40,270 | 31,693 | 15,859 | 15,834 | 78.70 |
| స్టేషన్‌ఘన్‌పూర్ | 44,189 | 33,916 | 17,019 | 16,897 | 76.75 |
| ఐనవోలు | 5,783 | 4,665 | 2,293 | 2,372 | 80.67 |
| కాజీపేట | 4,525 | 3,499 | 1,725 | 1,774 | 77.33 |
| లింగాలఘనపురం | 32,701 | 26,368 | 13,246 | 13,122 | 80.63 |
| రఘునాథపల్లి | 44,141 | 34,843 | 17,703 | 17,139 | 78.94 |
| వేలేరు | 16,254 | 12,633 | 6,383 | 6,250 | 77.72 |
| జఫర్‌గఢ్ | 33,569 | 26,203 | 13,277 | 12,926 | 78.06 |
| **మొత్తం** | **2,54,110** | **2,00,158** | **1,00,819** | **99,337** | **78.77** |

## 27న పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఎన్నికలు

- జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 23,419 మంది
- 27 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మే 15 : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి జిల్లాలో 23,419 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జి ల్లావ్యాప్తంగా 27పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు షేక్‌రిజ్వాన్ బాషా తెలిపారు. జనగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో పురుష ఓటర్లు 9,341 మంది, మహిళా ఓటర్లు 5,544 మంది, ఇతరులు ఒకరుతో కలిపి మొత్తంగా 14,886 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పురుష ఓటర్లు 5,574 మంది, మహిళా ఓటర్లు 2,959 మంది కలిపి 8,533 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో 85ఏళ్లుపైబడిన పట్టభద్రులు ముగ్గురు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాజశేఖర్

బచ్చన్నపేట, మే 15 : అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలింపూర్‌లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పరిశీలించారు. స్టాకు వివరాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి నెలా హాజరు శాతం, కోడిగుడ్ల సరఫరా సక్రమంగా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని టీచర్లు నెరవేర్చాలన్నారు. కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం మరింత పెంచాలని, పౌష్టికాహారం సకాలంలో అందజేయాలన్నారు. మరోవైపు బచ్చన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజు, సాల్వాపూర్‌లోని కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రమాదేవి, ఎలికట్టె వినోద తదితరులు పాల్గొన్నారు.

## రాఘవపురాన్ని సందర్శించిన కేంద్ర బృందం

### పారిశుధ్యం, నీటిగుంటల పరిశీలన

రాఘవపురంలో ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకుర్తి, మే 15 : మండలంలోని రాఘవపురం గ్రామాన్ని బుధవారం కేంద్ర బృందం అధికారులు సందర్శించారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కేంద్ర గ్రౌండ్ వాటర్ బోర్డు సైంటిస్ట్ బిజయకేతన్ మహంతి, సెంట్రల్ వాటర్ కమిషన్ డీఈ శ్రీచైతన్య, జనగామ డీఆర్‌డీవో ప్రాజెక్ట్ అధికారి వీరన్న చేరుకున్నారు. వీరికి ఎంపీడీవో ఏ రాములు, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, ఏపీవో మంజుల, స్పెషల్ ఆఫీసర్ జీవన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చు క్క లింగయ్యకు స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి ఇంటా ఇంకుడుగుంతలు నిర్మించిన ప్రదేశాలను కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు అధికారులు పరిశీలించారు. నీటి కుంటలను నిర్మించడంతో భూగర్భ జలాలు బాగానే ఉన్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటిని పరిశీలించి ప్రజలకు కల్పించిన మౌలిక వసతులను తెలుసుకున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, చేతి పంపుల వద్ద ఇంకుడుగుంతల ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులపై కేసు నమోదు

జనగామ చౌరస్తా, మే 15 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నంబర్ 263లోకి ప్రవేశించి న్యూసెన్స్‌కు కారణమైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జనగామ అర్బన్ సీఐ రఘుపతిరెడ్డి బుధవారం వెల్లడించారు.

పోలింగ్ రోజు కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, దాసరి క్రాంతి, మేడ శ్రీనివాస్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీరస్వామి, మజీద్, తిప్పారపు విజయ్, మల్లిగారి రాజు, గజ్జెల నర్సిరెడ్డి, ఉల్లెంగుల సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సదరు పోలింగ్ బూత్‌లో విధుల్లో ఉన్న ఏఆర్ ఎస్సై కే శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మే 15 : ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో జనగామ జిల్లాలో పోలింగ్ శాతం 6.6 పెరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే 2019లో జిల్లా సగటు పోలింగ్ శాతం 68.26 కాగా, ఈసారి 74.96 పోలింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచడం కోసం విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించినట్లు రిజ్వాన్ బాషా తెలిపారు. ఓటు ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యపర్చినట్లు పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కళాకారులచేత అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు విలువ గురించి దివ్యాంగులకు సైన్ లాంగ్వేజ్‌లో అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అత్యధిక ఓటరు నమోదుకు కృషి చేసిన ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న పట్టభద్రులు ఓటును వినియోగించుకోవాలని కోరారు.

## నియోజకవర్గ కేంద్రంలో తగ్గిన పోలింగ్

### స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో 76.75 శాతం నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓటు వేసిన యువకులు (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మే 15 : మూడు రోజుల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం రికార్డు సృష్టించి మొదటి స్థానంలో నిలిచింది. దీంతో 78.77 శాతం ఓటింగ్ నమోదైంది. కానీ స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో మాత్రం 76.75 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో 2,54,110 ఓట్లకుగాను 2,00,158 మంది ఓట్లు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో మాత్రం ఓటింగ్ శాతం తక్కువగా ఉంది. నియోజకవర్గ పరిధిలోని ఐనవోలు మండలంలో ఓటింగ్ శాతం ప్రథమ స్థానంలో ఉండగా, చివరి స్థానంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఉంది. నియోజకవర్గంలోని మండలాల వారీగా ఓటింగ్ శాతం పరిశీలిస్తే.. స్టేషన్ ఘన్‌పూర్ 76.75 శాతం, కాజీపేట 77.33, వేలేర్ 77.72, జఫర్‌గఢ్ 78.76, ధర్మసాగర్ 78.70, రఘునాథపల్లి 78.94, చిల్పూరు 80.60, లింగాలఘనపురం 80.63, ఐనవోలు మండలంలో 80.67 శాతం ఓట్లు పోలయ్యాయి.

## ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి

### ఫత్తేపూర్‌లో ఘటన.. పలువురికి గాయాలు

బాధితులను పరామర్శిస్తున్న ఏపీవో మోహన్

చిల్పూరు, మే 15 : మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. బుధవారం మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలోని బండ్లగట్టు ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలు పనులు చేస్తుండగా వారిపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో గుగులోతు బాలునాయక్, గుగులోతు అరుణ, గుగులోతు పీన, బానోతు భీమా, తిమ్మాపూర్ తరుణ్ కుమార్, తిమ్మాపూర్ రాజమణి అస్వస్థతకు గురయ్యారు. అక్కడే ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి వారికి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏపీవో మోహన్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## రెండు కాళ్లు కోల్పోయిన బాధితుడికి చేయూత

### రూ.52వేల ఆర్థిక సాయం అందించిన పద్మశాలి సంఘం

ఆర్థిక సాయం అందిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

స్టేషన్ ఘన్‌పూర్, మే 15 : రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న బాధితుడికి పద్మశాలి పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే .. మండల కేంద్రానికి చెందిన సాంబారి శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ గార్మెంట్స్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత మార్చి 9న శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వస్తుండగా స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ఘటనలో శ్రీనివాస్ తన రెండు కాళ్లను కోల్పోయాడు. విషయం తెలుసుకున్న పద్మశాలి పరపతి సంఘం స్టేషన్‌ఘన్‌పూర్ అధ్యక్షుడు పిట్ట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బాధితుడికి బుధవారం రూ.52వేల ఆర్థిక సాయం అందించారు. రెండు కాళ్లు కోల్పోవడంతో భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉందని సాంబారి శ్రీనివాస్ ఆవేదన చెందాడు. మానవతా దృక్పథంతో సాయం అందించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సాంబారి సత్యనారాయణ, కోశాధికారి గుండు రమేశ్, సభ్యులు గడ్డం కృష్ణమూర్తి, బొద్దున రవి, వేళ్ల సురేందర్, కే యాదగిరి, కే శ్రీనివాస్, రాజకుమార్, గబ్బెట రామస్వామి, గుండు మీనాక్షి, పిట్ట ప్రకాశ్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో పోలింగ్ అధికారులు, సిబ్బంది కోసం ఫైవ్‌స్టార్ హోటల్ తరహాలో చేసిన ఏర్పాట్లు

## ఎన్నికల పండుగ..

- పాలకుర్తిలో పోలింగ్ సిబ్బందికి ఫైవ్‌స్టార్ హోటల్ రేంజ్ భోజనం
- పెళ్లి..ఫంక్షన్ తరహా వంటకాలు
- ఆర్వో, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు పలువురి ప్రశంసలు

జనగామ, మే 15 (నమస్తే తెలంగాణ): అది ధనవంతుడి ఇంట పెళ్లి కాదు..ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఫంక్షన్ అంతకంటే కాదు. పాలకుర్తి నియోజకర్గ కేంద్రంలో పోలింగ్ విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి హైక్లాస్ రేంజ్‌లో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన విందు భోజనం ఎన్నికల పండగను తలపించింది. ఎన్నికలు అంటే సిబ్బందికి ఉడికీ ఉడకని అన్నం..పప్పు..పలుచటి సాంబారు చాలీచాలని ఏర్పాట్లతో మమ అనిపించి మిగిలిన సొమ్ము జేబులో వేసుకోవడం అనేకం చూశాం. కానీ జనగామ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) రోహిత్‌సింగ్ మాత్రం తాను రిటర్నింగ్ అధికారిగా ఉన్న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ రిసెప్షన్ సెంటర్‌లో ఫైవ్‌స్టార్ హోటల్‌ను తలపించే భారీ ఏర్పాట్లు చేయించారు. స్వాగత డ్రింక్ మొదలు..పానీపూరి..సమోసా రగ్డా..ముంజల దహీ..చోలే భాతురే..పనీర్ లిఫాఫా..వెజ్ బిర్యానీ.. మిక్స్‌డ్ వెజిటబుల్స్ కర్రీ..మిర్చి కా సలాన్..రైతా.. జలేబి..మాక్‌టైల్ డ్రింక్స్ వంటి మరెన్నో రకాల రుచికరమైన శాఖాహార మెనూతో కూడిన విందు భోజనం ఏర్పాట్లు చేయించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇలాంటి భారీ ఏర్పాటు..ఇంత రుచికరమైన భోజనం, రకరకాల వంటకాలు..ధనవంతుల పెళ్లిళ్లు..పేరంటాలు..ఫంక్షన్ తరహా ఏర్పాట్లు చేసి శభాష్ రోహిత్ సింగ్ సార్ అనిపించుకున్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ జరిగిన ఆదివారం రోజు 3వేల మందికి..తిరిగి సామగ్రి స్వీకరించిన సోమవారం రోజు మరో 3వేల మంది సహా అదనంగా 2వేల మందితో కలిసి రెండు రోజులు మొత్తం 8 వేల మందికి ఫైవ్‌స్టార్ రేంజ్ హోటల్ విందు భోజనం పెట్టారు. పాలకుర్తి ఆర్వో కేంద్రంలో చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తన అధికారిక ఎక్స్ ట్విటర్‌లో 'పెళ్లి..ఫంక్షన్ కాదు..ఎన్నికల పండగ రోజు అధికారులు..సిబ్బంది ఆనందంగా గడిపారు' అంటూ తన అభిప్రాయాన్ని షేర్ చేశారు.

## మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

కొడకండ్ల, మే 15 : మండల కేంద్రానికి టీఎస్ ఈజీసీ సభ్యుడు అందె యాకయ్య తండ్రి అందె మల్లయ్య(70) మంగళవారం రాత్రి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం ఉదయం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానూభూతి తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పేరం రాము, ఎంపీపీ ధరావత్ జ్యోతి, పాలకుర్తి జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎండీ అసీఫ్, యూత్ అధ్యక్షుడు దేశగాని సతీశ్ ఉన్నారు.

## రైలు ఢీకొని గ్యాంగ్‌మెన్ మృతి

మధుకుమార్ (ఫైల్)

రఘునాథపల్లి, మే 15 : రైలు ఢీకొని గ్యాంగ్‌మెన్ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆలేరు సెక్షన్ పరిధిలోని 6వ నంబర్ గ్యాంగ్‌మెన్‌గా మండలంలోని నిడిగొండకు చెందిన గొరిగె మధుకుమార్(29) బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం రాత్రి నైట్ డ్యూటీ చేసిన అనంతరం బుధవారం తెల్లవారుజామున నిడికొండకు రైలు పట్టాలు దాటి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. ఈ ఘటనలో మధుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. జీఆర్‌పీ హెచ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ సీహెచ్ నరేశ్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

## అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు

జనగామ చౌరస్తా, మే 15 : ఉద్యానవన, పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారులకు కొత్తగా ఎయిర్‌టెల్ సిమ్ కార్డులను ప్రభుత్వం అందజేసింది. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కేఆర్ లత ఫోన్ నంబర్ 8977714093, జనగామ నియోజకవర్గ ఉద్యాన అధికారి జే రవికాంత్ నంబర్ 8977714094, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అధికారి జీ ధీరజ్ ఫోన్ నంబర్ 8977714095 కొత్తగా అందుబాటులోకి వచ్చినట్లు వారు తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించిన సలహాల కోసం రైతులు సంబంధిత అధికారులను ఈ ఫోన్ నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉద్యాన అధికారి కేఆర్ లత సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

బచ్చన్నపేట, మే 15 : రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత దూడల కనకయ్యకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇటికాలపల్లికి చెందిన కనకయ్య తన కుమార్తెను హైదరాబాద్‌లో పరీక్ష రాయించి బుధవారం కారులో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో జగ్‌దేవ్‌పూర్ సమీపంలోని వరదరాజపురం వద్ద కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. బెలూన్లు ఓపెన్ కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కనకయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను ఒంటిమామిడిలోని ఆ ర్‌వీఎం దవాఖానలో చేర్చారు. కనకయ్య పరిస్థితి నిలకడగానే ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి వెల్లడించారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి : ఎంపీడీవో

బచ్చన్నపేట, మే 15 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో రఘురామకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలను పర్యటించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, వీధి లైట్లు, రోడ్ల పరిశుభ్రత వంటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించడంతోపాటు ట్రాక్టర్ ఈఎంఐ, కరెంటు చార్జీలు చెల్లించాలన్నారు.

## నేడు కంటి వైద్య శిబిరం

స్టేషన్ ఘన్‌పూర్, మే 15 : మండలంలోని శివునిపల్లిలో గురువారం(నేడు) ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, శివునిపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లయన్ ఎండీ దస్తగిర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హనుమకొండకు చెందిన శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఆపరేషన్‌ను ఉచితంగా చేయడమే కాకుండా రవాణా సదుపాయం కూడా ఉచితంగా అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

## రైల్వే వైద్యుడిపై సీఎంఎస్‌కు ఫిర్యాదు

కాజీపేట, మే 15 : కాజీపేట రైల్వే పాలిక్లినిక్‌ను బుధవారం తనిఖీ చేసేందుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణ స్వామికి తెలంగాణ రైల్వే జేఏసీ ఫిర్యాదు చేసింది. తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ.. కాజీపేట ఈఎల్ఎస్‌లో టెక్నీషియన్ రమేశ్ తన భార్యకు ఈ నెల 13న కడుపు నొప్పి రావడంతో రైల్వే పాలిక్లినిక్‌లో చేర్పించాడని, డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సు వైద్యం చేసిందన్నారు. నొప్పి తగ్గకపోవడంతో నర్సు ఫోన్ చేయగా అరగంట తర్వాత డాక్టర్ వచ్చాడన్నారు. రోగి భర్త రమేశ్‌ను వైద్యుడు ఉద్